సాక్షి ప్రకాశం
ఆదివారం । 8 । జూన్ । 2025



అప్పల సేద్యం చేయలేకనే ఆత్మహత్య..

అప్పల బాధతో మార్కాపురంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. - 10లో..



ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

వేగంగా వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. - 10లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు.



ఒంగోలులో ఈద్గా వద్ద దైవప్రసంగం చేస్తున్న ముస్లిం మత పెద్ద



ఈద్గాలో దువా చేస్తున్న ముస్లింలు



ఈద్ ముబారక్

ముస్లింలకు అత్యంత పవిత్రమైన బక్రీద్ పండుగను శనివారం జిల్లాలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి



లింగేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

ఒంగోలు సిటీ: బదిలీలు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉండగా, దానికి భిన్నంగా వెబ్ ఆప్షన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తుండడంతో ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎస్టీటీ, పీఈటీ, పండిట్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ కమిషనర్ హామీ ఇచ్చారని, అందుకు భిన్నంగా వ్యవహరించడంపై వారు మండి పడుతున్నారు. అలాగే ఆన్‌లైన్ బదిలీల్లో టెక్నికల్ సమస్యలు కారణంగా సీనియారిటీ ప్రకారం పోస్టుల చూపించడంలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. దీనికి వెబ్ ఆప్షన్ కౌన్సిలింగ్ కారణమని అంటున్నారు. వెబ్ కౌన్సిలింగ్ నిర్వహణకు ఏర్పాట్లను వ్యతిరేకిస్తూ శనివారం సాయంత్రం వరకూ జిల్లాలోని మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నగరంలోని డీఆర్ఆర్ మున్సిపల్ స్కూలులో ఆర్‌జేడీ లింగేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బదిలీలు జరుగుతున్న తీరుకు నిరసనగా ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు అబ్దుల్ హై, జనార్దనరెడ్డి, శేషారావు, రవి, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, పీవీ సుబ్బారావు కోరారు.

జిల్లాలో పలువురు తహశీల్దార్ల బదిలీ

- మరికొందరికి అడహాక్ పదోన్నతులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు తహశీల్దార్ల బదిలీలు, పలువురికి అడహాక్ పదోన్నతులు కల్పించినట్లు డీఆర్ఓ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్స్-1లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్ నారాయణ రెడ్డిని సంతనూతలపాడు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. కొత్తపట్నంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న పిన్నిక మధుసూదనరావును ఒంగోలు అర్బన్ తహశీల్దార్‌గా. ఒంగోలు అర్బన్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.వాసును వెలిగండ్ల తహశీల్దార్‌గా. దోర్నాలలో పనిచేస్తున్న అడహాక్ తహశీల్దార్ కే.శాంతిని కొత్తపట్నంకు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వలేటివారిపాలెంలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును కొండపికి, కొండపిలో పనిచేస్తున్న అడహాక్ తహశీల్దార్ పి.మురళిని జరుగుమల్లికి, జరుగుమల్లిలో అడహాక్ తహశీల్దార్ బి.జనార్దన్‌ను మర్రిపూడికి, కలెక్టర్ కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సీహెచ్.నాగార్జున రెడ్డిని అర్ధవీడుకు, నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ అక్విజిషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌కేఎండీ హుస్సేన్‌ను సీఎస్‌పురం తహశీల్దార్‌గా, తిరిగి విధుల్లోకి తీసుకున్న ఎస్‌కే నాగుల్ మీరాను హెచ్‌ఎంపాడు తహశీల్దార్‌గా, రాచర్లలోనే డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న అధికారికి ఫుల్ అడిషనల్ చార్జ్ ఇస్తూ అక్కడే తహశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నాగులుప్పలపాడు డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.వాసుదేవరావుకు పదోన్నతి కల్పించి పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం పామూరు తహశీల్దార్‌గా నియమించారు. ప్రకాశం జిల్లా ల్యాండ్ అక్విజిషన్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఏవీఎస్.శ్రీనివాస రావును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. పుల్లలచెరువులో పనిచేస్తూ సెలవులో ఉన్న ఎండీ నయీమ్ అహమ్మద్‌ను నెల్లూరు జిల్లాకు కేటాయించారు. తర్లుపాడులో పనిచేస్తూ సెలవులో ఉన్న బి.జయవర్ధన్‌ను కూడా నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఓ బీసీహెచ్ ఓబులేసు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు మే నెల 16 నుంచి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు గడువు విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను మళ్లీ జూన్ 9వ తేదీ వరకు పొడిగించిందన్నారు. అందుకోసం కలెక్టర్ ఆదేశాల మేరకు అందరూ ఆర్డీఓలు ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు.

ఇమ్మడిచెరువు సర్పంచ్‌గా వెన్నా వెంకటేశ్వరరెడ్డి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు సర్పంచ్‌గా ఉప సర్పంచ్ వెన్నా వెంకటేశ్వరరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సర్పంచ్ తోకల బాలకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఉప సర్పంచ్ వెన్నా వెంకటేశ్వరరెడ్డికి సర్పంచ్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ.. జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

తెల్ల బంగారం.. గుట్టుగా మాయం

అత్యంత విలువైన తెల్లక్వార్ట్జ ఖనిజాన్ని అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ రూ.కోట్లు గడించేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు కొండల్ని పిండి చేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతుండటంతో తెల్లరాయి గనులు కరిగిపోతున్నాయి. వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో అధికార పార్టీ నేతల అండదండలతో రాత్రికి రాత్రే చెన్నై తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

- కొండల్ని పిండిచేస్తున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా తవ్వకాలు
- చెన్నై మీదుగా విదేశాలకు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి
- మామూళ్లు మత్తులో జోగుతున్న అధికారులు



వైట్‌క్వార్ట్జ తవ్వుతున్న కొండ

కురిచేడు: అక్రమార్కులకు వైట్‌క్వార్ట్జ కాసుల వర్షం కురిపిస్తోంది. జిల్లాలోని దర్శి, కనిగిరి, గిద్దలూరు ప్రాంతాల్లో తెల్లరాయి గనులు ఉన్నాయి. కురిచేడు, పీసీ పల్లి, పామర్రు, హనుమంతునిపాడు, సీఎస్ పురం, కొమరోలు తదితర ప్రాంతాల్లో తెల్లరాయి ఖనిజం అధికంగా లభిస్తోంది. ఈ ప్రాంతాల్లో అధికారికంగా, అనధికారికంగా సుమారు రెండు వందల క్వారీలున్నాయి. వీటి ద్వారా కోట్ల విలువైన ఖనిజం అడ్డదారుల్లో విదేశాలకు తరలిపోతోంది. జిల్లాలో నాలుగు రోజుల కిందట పీసీ పల్లి మండలం మురుగమ్మి సమీపంలోని పచ్చటి కొండ ప్రాంతంలో విరివిగా లభ్యమవుతున్న వైట్ క్వార్ట్జ ముడి ఖనిజాన్ని టీడీపీ నాయకుడు అడ్డగోలుగా తవ్విస్తున్నాడన్న ఆరోపణలు రావడంతో హడావిడిగా మైనింగ్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రాయిని సీజ్ చేసి మమ అనిపించారు. ఇక, కురిచేడు మండలం బోధనంపాడు గ్రామం పక్కనే 227 సర్వే నంబరులో 943 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. కొండ చుట్టూ కొంత పోరంబోకు స్థలం కూడా ఉంది. గ్రామ సర్వే నంబరు 227లో 22.494 హెక్టార్లకు అమరం కమోడిటీ వెంచర్స్ కంపెనీ అనుమతి పొందింది. కానీ, దానిలో కేవలం 5 హెక్టార్ల విస్తీర్ణం కొండ ప్రాంతంలో 150 మీటర్ల లోతు వరకు మాత్రమే మైనింగ్ ఏరియా చేయాలనే నిబంధన ఉంది. అధికారులు అనుమతిచ్చింది కొంతవరకే కాగా, సర్వే నంబరు మొత్తం అనుమతి ఉందంటూ అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైట్ క్వార్ట్జను ఇళ్ల నిర్మాణాల్లో, గాజు తయారీ పరిశ్రమలు, మెటల్ కాస్టింగ్, రబ్బర్, పెయింట్, సెరామిక్, పెట్రోలియం తదితర పరిశ్రమల్లో అవసరాలకు అధికంగా వినియోగిస్తారు.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి...

అధికారులు అక్రమార్కులతో చేతులు కలపడంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అంతా సక్రమ మార్గంలో వెళితే ప్రభుత్వానికి రూ.లక్షల్లో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎగుమతి సుంకం కూడా చెల్లించాలి. అలాగే తవ్వకాలు జరుగుతున్న పంచాయతీలకు సైతం టన్నుల ప్రకారం రుసుం చెల్లించాలి. అయితే వీటన్నింటికి తూచ్ అంటూ అంతా రాత్రివేళ అక్రమార్కులు చెన్నై తరలించేస్తున్నారు. దారిలో అధికారులెవరైనా తనిఖీలు చేస్తే వారికి ఎంతో కొంత ముట్టజెప్పి సరిహద్దులు దాటించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కురిచేడు మండలంలో కొన్ని శాఖల అధికారులకు నెలనెలా వాటా చేరుతుందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వైట్‌క్వార్ట్జ అక్రమ వ్యాపారులపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

విదేశాల్లో మంచి గిరాకీ...

నాణ్యతను బట్టి తెల్ల ఖనిజానికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఒక లారీకి సుమారు 40 నుంచి 50 టన్నులు లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా నెల్లూరు మీదుగా చెన్నై, అక్కడి నుంచి విదేశాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఒక లారీ వైట్ క్వార్ట్జ విలువ సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకూ ఉంటుంది. మండలంలో ఒక్క బోధనంపాడు కాకుండా పెద్దవరం, పడమర వీరాయపాలెం, ఎస్ఎస్‌పీ అగ్రహారం రెవెన్యూ గ్రామాల పరిధిలో తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇదంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వేల టన్నుల వైట్ క్వార్ట్జ అక్రమ మార్గంలో తరలిపోతోంది. ఈ వైట్‌క్వార్ట్జ లారీలు మద్రాసు వెళ్తాయి. అక్కడి నుంచి షిప్పుల ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి జరుగుతోంది.



కొండపై పనివారి కోసం నిర్మించిన షెడ్లు



తవ్వి తీసి ఎగుమతికి సిద్ధం చేసిన వైట్‌క్వార్ట్జ

గిట్టుబాటు ధరలు లేకే రైతుల ఆత్మహత్యలు

- ఆత్మహత్య చేసుకున్న రైతుకు మాజీ మంత్రి సురేష్ నివాళులు



చల్లా మధుసూదన్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

కొండపి: కూటమి ప్రభుత్వంలో పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. అప్పు చేసి పొగాకు పంట పండించి, గిట్టుబాటు ధర లేక గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకున్న నెన్నూరుపాడు గ్రామానికి చెందిన చల్లా మధుసూదన్ రెడ్డి మృతదేహానికి సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఒంగోలులోని రిమ్స్ లో పోస్టుమార్టం నిమిత్తం తీసుకువెళ్లిన మృతదేహాన్ని మార్చురీలో పరిశీలించి కుటుంబ సభ్యులను అడిగి మృతికి కారణాలు, అప్పుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కొండపి మండలంలోని మృతుని స్వగ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్ని, భరోసాను కల్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి పొగాకుతో పాటు పలు పంటలు సాగు చేయటంతో గిట్టుబాటు ధర లేక సుమారు రూ.10 లక్షల అప్పులయ్యాయని చెప్పారు. రాబోయే రోజుల్లో రైతుల ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పొగాకుతో పాటు అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేయాలని హితవు పలికారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకుడు మారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పొగాకు రైతులను నమ్మించి మోసగించారు

- ఇప్పటికైనా గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్



విలేకరులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తలశిల రఘురామ్ తదితరులు

పొదిలి రూరల్: ఈ ఏడాది పొగాకు సాగు చేసిన రైతులను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేయడమే గాక రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని పొదిలికి ఈ నెల 11న రానుండటంతో వైఎస్సార్ సీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో కలిసి శనివారం అందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఉన్న పొగాకును కొనే నాథుడే లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు అప్పుల బాధలు తట్టుకోలేక అయోమయంలో పడ్డారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతును రాజుగా చూసుకున్నారని చెప్పారు. పొగాకు, మిర్చి, వరి, పత్తి రైతులకు ఏకష్టం రాకుండా గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కష్టాలు, కార్పణ్యాలతో ప్రజలను ఇబ్బందులు పెడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద కేసులు పెడుతూ, పరిపాలన గాలికి వదిలేసిందన్నారు. తమ ప్రభుత్వంలో మిర్చి క్వింటా రూ.24 వేలు, వరికి గిట్టుబాటు ధర రూ.18 వేల నుంచి రూ.20 వేలు ఉంటే ఈ ప్రభుత్వంలో అడిగే నాథుడే లేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. పొగాకు కంపెనీల ప్రతినిధులు రైతులను ప్రోత్సహించి పంటలు సాగు చేయించి తీరా కొనుగోలు సమయంలో కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ఉన్న సమయంలో పొగాకు క్వింటా రూ.32 వేలు, లోగ్రేడ్ రూ.24 వేలు ఉంటే ఈ ప్రభుత్వంలో లోగ్రేడ్ కొనే పరిస్థితి లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా మిర్చి, పొగాకు, ధాన్యం రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలిచి మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు రూ.100 కోట్లు వెచ్చించి కొనుగోలు చేయించారన్నారు. అలా చేయడం వల్ల వారిలో పోటీ పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ రోజు అటువంటి ప్రక్రియ ఎక్కడా జరగడం లేదన్నారు. ప్రైవేటు వ్యాపారులు వారికి ఇష్టమైన రేట్లు ఇవ్వడంతో రైతాంగం పూర్తిగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ప్రభుత్వం చేసిన విధానాన్ని అవలంబించి రైతులకు అండగా నిలవాలన్నారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అన్నా కృష్ణ చైతన్య, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జీ శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, సంజీవరెడ్డి, వైఎం ప్రసాదరెడ్డి, కే నరసింహారావు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన భక్తిభావం


పామూరులో ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


యర్రగొండపాలెంలో...


కంభంలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు


ఒంగోలులో ఈద్గా వద్ద సంప్రదాయ టోపీలు, అత్తర్లు, శాలువాలు కొనుగోలు...

బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని మసీదుల్లో, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని వారి మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలు భక్తిభావాన్ని చాటాయి. చిన్నాపెద్దా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ విశిష్టత గురించి ముస్లిం మత పెద్దలు ఆధ్యాత్మిక ఉపన్యాసాలిచ్చారు. ఎంతో నిష్టగా దువా చేశారు.

– సాక్షి, ఒంగోలు


దువా చేస్తున్న ముస్లిం మత పెద్దలు


ఈద్గా వద్ద కాళ్లు, చేతులు, ముఖం శుభ్రం చేసుకుంటున్న ముస్లింలు


ఒంగోలులో ఈద్గా వద్దకు చేరుకుంటూ...




ఒంగోలులో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ...


ఈద్గా వద్ద కళ్లకు సుర్మా పెట్టించుకుంటూ...

క్లుప్తంగా

అన్నదాత సుఖీభవతో రైతులను ఆదుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తక్షణమే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని, రైతుల ఖాతాలో రూ.20 వేలు జమ చేయాలని, కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం సాయాన్ని అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. రైతులందరికీ పంటల బీమా వర్తింపచేయాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 9వ తేదీ మండల కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, కౌలు రైతులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వీరారెడ్డి, వి.హనుమారెడ్డి, రైతు నాయకులు చెరుకూరి వాసు పాల్గొన్నారు.

పగలు ఎండ, సాయంత్రం వర్షం

ఒంగోలు టౌన్: రోహిణి కార్తె పట్టపగలే చుక్కలే చూపిస్తోంది. నగరంలో శనివారం నిప్పులు కురిసే ఎండ కాసింది. పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు దాటింది. దాంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడి పోయారు. చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. ఎండ దెబ్బకి ప్రజలు ఇంటి నుంచి బయటకు రాక పోవడంతో ఉదయం 11 గంటల నుంచే నగరంలోని ప్రధాన రహదారులన్నీ నిర్జనంగా మారాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే గాంధీ రోడ్డు, బాపూజీ కాంప్లెక్స్, కొత్త మార్కెట్ సెంటర్, నెల్లూరు బస్టాండు సెంటర్ తదితర రోడ్లన్నీ జనం లేక బోసిపోయాయి. బక్రీదు పండుగ కావడంతో ప్రభుత్వ సెలవు ఉండడంతో కలెక్టరేట్ నిర్మానుష్యంగా మారిపోయింది. నగరంలో ఎక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు గొంతు తడుపుకోవడానికి అల్లాడిపోయారు. ఎండలు మండిపోతున్నా నగర పాలకులు చలివేంద్రాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వినవస్తున్నాయి. మరోవైపు సాయంత్రం 4 గంటల సమయంలో చిన్నపాటి వర్షం కురిసింది. కేవలం 5 నిముషాల పాటు చినుకులు కురిసిపోవడంతో మరింత ఉక్కపోత ఎక్కువైంది.

అప్పుల సేద్యం చేయలేకనే ఆత్మహత్య..!

- ఒకవైపు పంటలకు మద్దతు ధర తరిగి.. మరోవైపు అప్పులు పెరిగి...
- మార్కాపురంలో కౌలు రైతు ఆత్మహత్యకు ఇవే ప్రధాన కారణాలు
- పొలంలోనే పురుగుమందు తాగి బలవన్మరణం


యలమందయ్య మృతదేహం


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మార్కాపురం: వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో ఎంతో ఆశగా పంటలు పండించాడు. సొంత పొలం లేకపోయినప్పటికీ కౌలుకు తీసుకుని మరీ ఆరుగాలం శ్రమించి సేద్యం చేశాడు. పెట్టుబడి కోసం ప్రభుత్వ సాయం అందకపోవడంతో అప్పులు చేశాడు. అష్టకష్టాలు పడి పండించిన పంటలకు చివరకు గిట్టుబాటు ధరలు దక్కలేదు. మద్దతు ధరల గురించి సర్కార్ సైతం పట్టించుకోలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక పొలంలోనే పురుగుమందు తాగి ఆ కౌలు రైతు బలవన్మరణం చెందాడు. మార్కాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పెట్రోల్ బంకు పక్క రోడ్డులో ఉన్న పొలంలో శనివారం ఉదయం కౌలు రైతు ఆత్మహత్య జిల్లా రైతాంగాన్ని కలచివేసింది. తర్లుపాడు మండలం మీర్జపేట గ్రామానికి చెందిన రాజారపు పెద్ద యలమందయ్య (55) తన భార్య కాశమ్మతో కలిసి 2002లో మార్కాపురం పట్టణంలోని సుందరయ్యకాలనీకి వలస వచ్చారు. బతుకుదెరువు కోసం పలకల పనికి యలమందయ్య వెళ్లేవాడు. ఆ తర్వాత మార్కాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అందులో 2 ఎకరాల్లో గడ్డి సాగుచేస్తూ పాడిగేదెలు చూసుకుంటున్నారు. మిగిలిన పొలంలో కాలాన్ని బట్టి మిర్చి, పత్తి, తదితర పంటలు సాగుచేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాలు చవిచూశాడు. 7 ఎకరాల్లో సాగుచేసిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక పురుగుమందు తాగి యలమందయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు 20 నుంచి 25 లక్షల రూపాయల అప్పులున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులకు తోడు వడ్డీలు కూడా పెరుగుతుండటంతో యలమందయ్య మానసిక వేదనకు గురైనట్లు తెలిపారు.

అప్పులిచ్చిన వాళ్లు ఇంటికొచ్చి గొడవ చేయడంతో...

నాలుగేళ్ల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని యలమందయ్య పంటలు పండిస్తున్నాడు. ఇటీవల పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేకపోయాడు. ఏం చేయాలో పాలుపోక ఆందోళనలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో నెల క్రితం అప్పులిచ్చిన వ్యక్తులు ఇంటివద్దకు వచ్చి గొడవచేసినట్లు బంధువులు తెలిపారు. దీంతో పాటు అతని అల్లుడు కూడా మామ పేరు చెప్పి అప్పు చేయడంతో గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో యలమందయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కాశమ్మతోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ పెళ్లిళ్లు చేశాడు. సంఘటనపై మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలడిగి తెలుసుకున్నారు. రైతు సంఘ నాయకులతో పాటు సీపీఎం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, సోమయ్యలు యలమందయ్య మృతదేహాన్ని సందర్శించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలి

- చిన్నారులకు జేసీ గోపాలకృష్ణ పిలుపు


వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు టౌన్: చిన్నారులు మంచి పుస్తకాలను అధ్యయనం చేయాలని, గ్రంథాలయాన్ని తరచూ సందర్శిస్తూ బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని జేసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఈ నెల 6వ తేదీతో ముగిశాయి. శనివారం ముగింపు సభ నిర్వహించగా, జేసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు అలవాటుపడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్లకు బదులుగా పుస్తకాలివ్వడం ద్వారా మంచి అలవాట్లు చేయాలన్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు జేసీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఆర్.బిందుమణి, శిరీష, సూర్యకుమారి, నాగలక్ష్మి, శ్రీనివాసరావు, వి.వెంకయ్య, రవీంద్ర, డి.లక్ష్మీప్రసాద్, జాలాది మోహన్, మంచికంటి కాశీవిశ్వనాథ్, శ్రీమన్నారాయణ తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పి.పేరయ్య, శాంసన్, అనిల్, శివకుమారి, మృదుల్ కుమార్, గోవిందమ్మ, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి


మరణించిన వెంకాయమ్మ

ఒంగోలు టౌన్: వేగంగా వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఒంగోలు నగరంలోని ఒక ప్రైవేటు హైస్కూల్లో కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న చీమలదిన్నె మల్లికార్జున స్కూటీపై తన తల్లి వెంకాయమ్మను ఎక్కించుకుని స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మస్తాన్‌దర్గా వైపు వెళ్తున్నారు. అదే సమయంలో వెనక నుంచి వేగంగా వచ్చిన కేఎంబీటీ ట్రావెల్స్ బస్సు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిపోయిన వెంకాయమ్మ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ కార్యకర్తల ఘర్షణ

- పరస్పర కేసులు నమోదు

కురిచేడు: టీడీపీ కార్యకర్తలు ఘర్షణపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం కురిచేడుకు చెందిన కంభంపాటి రూతుబాబు, పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన మరికొందరు కురిచేడులోని ఏఎంసీ మార్కెట్ యార్డు వద్ద హోటల్లో ఘర్షణపడి కొట్లాడుకున్నారు. ఇరువర్గాల వారు గాయపడి ఆస్పత్రుల్లో చేరడంతో.. ఆస్పత్రుల నుంచి వచ్చిన సమాచారం మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు కురిచేడు ఎస్సై ఎం.శివ తెలిపారు. కంభంపాటి రూతుబాబుకు పార్టీ అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్ షాపు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకోగా, అతనికి ఇవ్వకుండా పడమరవీరాయపాలెం గ్రామానికి చెందిన కాశినేని వెంకటసుబ్బారావు అడ్డుపడ్డాడు. ఆ విషయాన్ని అడిగినందుకు సుబ్బారావు, మరో 12 మంది కలిసి రూతుబాబును కులంపేరుతో దూషిస్తూ కొట్టారు. గాయాలవటంతో రూతుబాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి గురించి సోషల్ మీడియాలో విమర్శిస్తూ రూతుబాబు పోస్టులు పెడుతున్నాడని అడిగినందుకు మరికొందరితో వచ్చి ఘర్షణపడినట్లు తూమాటి రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ దాడిలో వారికి కూడా గాయాలవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పెద్దదోర్నాల: ఆపరేషన్ చేయించుకున్న భార్యను దుర్భాషలాడినందుకు సొంత తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగు రోజుల క్రితం చోటుచేసుకున్న ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పెద్దదోర్నాల మండల పరిధిలోని ఎడవల్లి గ్రామానికి చెందిన సింగ్ సుధాకర్ (35), లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు సంతానం. లక్ష్మీదేవికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కడుపులో గడ్డ ఉందని ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి సుధాకర్ భార్యను తరచూ వేధిస్తున్న క్రమంలో అతని తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా మందలించారు. మనస్తాపానికి గురైన సుధాకర్ బలిజేపల్లి దారిలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.